بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 11.09.2015 (Telugu)

**విశ్వాసములో దృఢమై, ఇస్లాం వాస్తవికతను అర్థము చేసుకున్నప్పడే ముస్లిం అగు సౌందర్యము ప్రత్యక్షమగును. తతను తాను సంపూర్ణముగా అల్లాహ్ తాలాకు అప్పగించి, అతపి ఆదేశములను పాటించువారగుట విశ్వాసము. అల్లాహ్ తఆలా ఆదేశములను దృష్టియందుంచుకొని తమను తాము దుష్టత్వము నుండి దూరముంచుకొంటూ, ఇతరులకు కూడ శాంతి అందించుట ఇస్లాం.**

*హజ్రత్ అమీరుల్ ముఖినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 11.09.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించిరి.

విశ్వాసములో దృఢమై, ఇస్లాం వాస్తవికతను అర్థము చేసుకున్నప్పుడే ముస్లిం అగు సౌందర్యము ప్రత్యక్షమగును. తమను తాము సంపూర్ణముగా అల్లాహ్ తఆలాకు అప్పగించి, అతని ఆదేశములను పాటించువారగుట విశ్వాసము. అల్లాహ్ తఆలా ఆదేశములను దృష్టియందుంచుకొని తమను తాము దుష్టత్వము నుండి దూరముంచుకొంటూ, ఇతరులకు కూడ శాంతి అందించుట ఇస్లాం. విశ్వాసము, ఇస్లాం సారాంశమిది. ముస్లిం ప్రపంచము దీనిని అర్థము చేసుకొన్నచో ప్రపంచములో నిలకడ గల శాంతి, సంధిని ఏర్పాటు చేయు ఎటువంటి దృశ్యములు కనిపించుననగా ప్రపంచమును స్వర్గ సీమగా మార్చును.

ఈ కాలములో ఈ నిజమైన విశ్వాసమును హృదయములలో ఏర్పాటు చేయుటకు, స్వచ్ఛమైన ఇస్లాం ఆదర్శములను చూపించుటకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాంను అల్లాహ్ తఆలా పంపెను. మనము వారి పక్షమైనప్పుడు స్వచ్ఛమైన విశ్వాసమును ఏర్పాటు చేయుచు, ఇస్లాం సరియైన ఉదాహరణ అగుచు ఈ కార్యములో వారి సహాయకులగుట మన బాధ్యత. ప్రపంచములో ప్రతి చోట అల్లాహ్ తఆలా కృపానుసారము అహ్మదియ్య జమాఅత్ ఈ కార్యమును చేపట్టుచున్నది. మనలోని ప్రతి ఒక్కరు తమ కర్తవ్యమును నిర్వర్తించుటకు ప్రతి అహ్మదీ ఇస్లాం బోధనకు ఆదర్శముగా మారవలెను. దురదృష్టవశాత్తు నేడు ముస్లిం ప్రపంచములో ఏర్పడిన అశాంతి ఇస్లాంను అప్రతిష్టకు గురిచేసినది. తమ స్వార్థములు ఇస్లాంను ఎంత వరకు గాయపరిచినవో ముస్లిం దేశములు అర్థము చేసుకొనినచో బాగుండును. ప్రతి స్థాయిలో స్వార్థము బలపడినందున ఉగ్రవాద సంస్థలు, వర్గములు ఏర్పడినవి. దేశముల శాంతి విచ్ఛిన్నమగుచున్నది. తాము శాంతియుతంగా యుండక ఇతరులకు కూడ శాంతిని అందించడం లేదు. ప్రభుత్వము ప్రజలతో న్యాయముగా వ్యవహరించడం లేదు, ప్రజలు కూడ ప్రభుత్వ హక్కులు చెల్లించడం లేదు. ఈ రెండు హద్దులు దాటుటను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒక చోట వివరించుచు ఇట్లనిరి. ఇవి రెండు విధాలుగా (అనగా ప్రభుత్వ కర్తవ్యములు, ప్రజల కర్తవ్యములు) సమానముగా నడిచినంత వరకు ఆ దేశములో శాంతి కొనసాగును, ప్రజల తరపున లేదా పాలకుని తరపున హద్దులు దాటినప్పుడే దేశములో శాంతి కనుమరుగగును.

దురదృష్టవశాత్తు నేడు అధిక ముస్లిం దేశములలో ఇదే జరుగుచున్నది. తద్వారా ఇస్లాం శత్రు శక్తులు కూడ దీని వలన తమ స్వార్థములను పొందుచున్నవి. ఒక వైపు ఇరువురి వివాదమును పెంచుటకు సహాయము చేయబడును, రెండవ వైపు ఉగ్రవాద చర్యలకు ప్రచారము కల్పించి, ప్రెస్, మీడియా అతిగా ప్రచురించును. ఇలా ప్రచురించి ఇస్లాంను అపనిందకు గురిచేయును. నేనిచ్చిన ఇంటర్వ్యూలలో వారికి నేనిట్లు తెలిపితిని. ఇస్లాంకు వ్యతిరేకముగా

ద్వేషమును వ్యాపించుట, దానిని ఉగ్రవాద మతముగా చిత్రీకరించుటలో మీ మీడియా పాత్ర కూడ యున్నది. మీడియా న్యాయముగా వ్యవహరించడం లేదు. ఏదో ఒక వర్గము, తాము ముస్లిం అంటున్న ఏదో ఒక దేశ పాలకుల రాజకీయ సంకల్పములకు మతము పేరిచ్చి ఇస్లాం బోధనను అపనిందకు గురిచేయుచున్నారు. దీనిని ఎంత వరకు ప్రచారము చేసినారనగా ప్రపంచములో నివసించుచున్న వారి ఆలోచననే మార్చివేసిరి. ఇస్లాం గురించి ఏమి తెలియని వారి మెదడులో ఇస్లాంను ఎలా చీత్రీకరించిరనగా, ఎలా భూతమును నిలిపిరనగా ఇస్లాం పేరును వినగానే వారి ముఖ కవలికలు మారిపోవుచున్నవి. మీ స్వలాభములు యున్నచోట వార్తలు దాచిపెట్టుదురు. శాంతిని ప్రస్తావించుచున్న వేలాది, లక్షలాది ముస్లిములను మీడియా ప్రస్తావించదు. వ్యతిరేక చర్యలు చూపించే వారికి అధిక ప్రాధాన్యతనిత్తురు. అందరి కంటే ఎక్కువ అహ్మదియ్య జమాఅత్ ప్రేమానురాగ ఇస్లాం బోధనను వ్యాపించుచున్నది. ప్రపంచవ్యాప్తముగా ఒక ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యమును చేపట్టుచున్నది. దీని ఫలితముగా శాంతి పతాకము నీడన శాంతిని వ్యాపింపజేయుటకు, సంధిని ఏర్పరచుటకు ప్రతి సం॥ లక్షలాది ప్రజలు జమాఅత్‌లో చేరుచున్నారు. దీని గురించి మేము మీకు చెప్పినను మీరు అసలే పట్టించుకోరు. అహ్మదియ్య జమాఅత్ ద్వారా ఇస్లాం నిజమైన ముఖమును చూచి, వారి హృదయములపై ప్రభావము పడిన పలు వ్యక్తుల ఉదాహరణలను నేను ఇప్పుడు ప్రవేశపెట్టెదను. వీరిలో ముస్లిములున్నారు, ముస్లిమేతరులు కూడ యున్నారు. ఇస్లాం అందమైన చిత్రమును చూచి ఇస్లాంను కూడ స్వీకరించిన వారు చాలా మంది యున్నారు. వారిట్లనిరి. ఇస్లాం ఈ అందమైన బోధన నేడు ప్రపంచానికి అవసరమున్నది, ఇస్లాం గురించి మీడియా వ్యతిరేక భావన ఇచ్చి మా ఆలోచనలకు తాళం వేసినది. అహ్మదియ్య జమాఅత్ ఆ తప్పుడు ఆలోచనలను దూరము చేసినది. చెరి, బేనిన్‌లోని అపొస్టలిక్ చర్చి పాద్రి అక్కడ మస్జిద్ ప్రారంభోత్సవము సందర్భమున స్పష్టముగా ఇట్లు అభిప్రాయపడిరి. ఈనాడు నా జీవితములోని విచిత్రమైన దినము. నేడు ముస్లిములు, క్రైస్తవులు ఒకే చోట కూర్చున్నారు.

జమాఅత్ ఈ కార్యముల ప్రభావము న్యాయ ప్రియులైన రాజకీయ నాయకులపై కూడ పడినది. ఇక్కడి సభ రోజులలో మీ ముందు కొందరు తమ అభిప్రాయమును వ్యక్తపరచిరి కావచ్చును. ప్రపంచములో అహ్మదియ్య జమాఅత్ అల్లాహ్ తఆలా కృపానుసారము ఈ ఇస్లాం బోధనను ప్రవేశపెట్టుచున్నది, పని చేయుచున్నది, దీని ఆచరణ చిత్రమును ప్రపంచము ప్రశంసించుచున్నది. జమాఅత్ సేవలను ఇష్టపడుదురు, ఎంతో అందమైన బోధన అని అభిప్రాయపడుదురు. బేనిన్ రవాణా మంత్రి ఇట్లనిరి. బేనిన్‌లో అహ్మదియ్య జమాఅత్ ప్రజా సేవలు, అహ్మదియ్య జమాఅత్ చేసిన శాంతి, ప్రేమనురాగ కృషి బేనిన్ దేశములో ప్రథమ స్థానములో గలదు. శాంతి, ప్రేమానురాగ ప్రయత్నములో అహ్మదియ్య సేవలకు నేను నమస్కరించుచున్నాను.

కబాబీర్ మిష్నరీ ఇట్లు వ్రాసిరి. కొన్ని రోజుల క్రితం మన మస్జిద్ ముందు ఒక యూద ఉపాధ్యాయుడు తమ పాఠశాల పిల్లలకు జమాఅత్ పరిచయము చేయుచుండెను. బహుశా ఆ ఉపాధ్యాయునికి అరబ్బి వచ్చును. మా మస్జిద్ ద్వారముపై وَمَنْ دَخَلَهُ كَانَ آمِنًا వ్రాసియున్నది. ఆ ఉపాధ్యాయుడు ఈ పదములను అనువదించి వారికి తెలుపుచుండెను. దీని అర్థమేమనగా ఇందులో ప్రవేశించిన వారు శాంతి పొందెదరు. ఈ వాక్యమునకు ఆచరణాత్మక ఉదాహరణ కేవలము అహ్మదీయుల మస్జిద్‌లోనే కనిపించును.

ప్రజల దృష్టిని ఏ విధముగా అల్లాహ్ తఆలా మరల్చును. బేనిన్‌లో మోయూ నామము గల ఒక ప్రాంతము యున్నది. ఇక్కడ అందరు అన్యారాధకులే నివాసముంటున్నారు. ప్రచారము కొరకు మన మిష్నరి అక్కడికి వెళ్లిరి. జమాఅత్ ప్రచారము చేసిన తరువాత ఎవరి మదిలోనైనా ఏదైనా ప్రశ్న యున్నచో ప్రశ్నించగలరని వారనిరి. అందుకు నేను మీ ఉపన్యాసమును విన్నాను, ఇస్లాం గురించి అపోహలన్ని తొలగిపోయినవి. ఈ అన్యారాధకులలో

నుండి ఇస్లాం, అహ్మదియ్యత్‌ను స్వీకరించుచున్న మొదటి వ్యక్తిని నేనని ఒక పెద్ద వ్యక్తి అనిరి. అనంతరం ఆ గ్రామము నుండి 40 మంది ఇస్లాం, అహ్మదియ్యత్‌లో చేరిరి. ఇక్కడ ఒక జమాఅత్ ఏర్పడినది. తక్షణ మార్పు ఏమి కలిగినదనగా వారు దురాచారములను వీడిరి. మరొక్క రోజు ఇట్లనిరి. అహ్మదీ అయిన తరువాత నా శరీరములో ఒక క్రొత్త స్ఫూర్తి ఏర్పడినది. నేనెక్కడున్నా నా స్ఫూర్తి నన్ను, నా మనసు నన్ను జాగ్రత్త పరచును. నమాజ్ సమయమైనదని అనును, వారిలో ఈ పట్టుదల నమాజ్ కొరకు కూడ ఏర్పడినది. ఈ విధముగా నా ఆత్మకు సుఖ, శాంతి లభించుచున్నది. క్రొత్తగా చేరువారు ప్రార్థనల వైపు కూడ ఆసక్తి కలిగియున్నారు, ఎంతో శ్రద్ధతో నమాజ్ చదువుచున్నారని మనలో అలసట వహించుచున్న వారు గుర్తుంచుకోవలెను.

నేడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారనే ఇస్లాం స్వచ్ఛమైన బోధన ప్రపంచానికి అందవచ్చును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సందేశమును అల్లాహ్ తఆలా ఏ విధముగా ప్రపంచానికి అందించుచున్నాడో, ప్రజలపై ఎలా ప్రభావము వేయుచున్నాడో గనీకనాకరికి చెందిన ఒక సంఘటన తెలిపెదను. అక్కడి ఒక మన అహ్మదీ మిత్రులు అబూబకర్ గారు ప్రచార సమావేశము ఏర్పాటు చేసిరి. ఈ మురబ్బి ఇట్లనిరి. మేము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సందేశమును ప్రజలకు అందించితిమి. ఇంకా ప్రచారము కొనసాగుచుండగానే చెడగొట్టుటకు అక్కడికి ఒక మౌల్వీ చేరెను. కొంత సమయము వరకు మౌనముగా మాటలను వినిన తరువాత ఎంతో కోపముతో ఇక్కడ ప్రచారము చేసే అనుమతి మీకు లేదు, పోలీసులచే నేనిప్పుడే మిమ్ములను ఇక్కడ బంధింతునని అనెను. అక్కడి నవయువకులు నిలబడి ఆ మౌల్వీతో చాలా కోపముగా ఇట్లనిరి. నీవిప్పటి వరకు మమ్ములను మార్గభ్రష్టులుగా చేసితివి కనుక ఇక్కడి నుండి వెంటనే వెళ్లిపొమ్ము. ఆ మౌల్వీ తల దించుకొని అక్కడి నుండి వెళ్లిపోయెను. ఫలితముగా అక్కడి సమావేశములో పాల్గొన్న 15 మంది జమాఅత్‌లో చేరిరి.

గనాకరికే చెందిన మరో సంఘటన ఇట్లు గలదు. మేము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆగమన ఉద్ధేశము తెలిపి, వారి ఆగమనము గురించి ప్రస్తావించి తుది కాల లక్షణములు ఇట్లుండును, ఇందులో మసీహ్ మౌవూద్ అవతరించునని వివరించితిమి. ఈ అసాధారణ విషయము ప్రజలపై ప్రభావము చూపెను. స్థానిక ప్రజలు, మిష్నరీ ప్రచారము కొనసాగించిరి. ఒక్క వారములోనే ఆ గ్రామము ఇమామ్, మస్జిద్‌తో సహా అహ్మదియ్యత్‌లో చేరటమే కాక సమీప ఐదారు గ్రామములు బైఅత్ చేసి స్వచ్ఛమైన ఇస్లాంలో చేరిరని వారనిరి. ఇంకా సంప్రదింపులు కొనసాగుచున్నవి. ప్రజలు వ్యాకులతతో నిజమైన ఇస్లాంలో చేరుటకు సిద్ధముగా యున్నారని సందేశములు అందుచున్నవి.

ఆఫ్రీకాలో ఒక చోట పవిత్ర ఖుర్ఆన్ ప్రదర్శనలో భాగంగా మన పుస్తక శిబిరము ఏర్పాటు చేయనైనది. ఇద్దరు ముస్లిం నవయుకులు వచ్చిరి. వారికి అహ్మదియ్యత్ పరిచయము చేసి, ఇమామ్ మహ్దీ అలైహిస్సలాం వచ్చిరని తెలిపి ఫ్రెంచ్ భాషలో మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యము అను పుస్తకము చదువుటకు ఇవ్వనైనది. తుది కాలములో ముస్లిముల దీన స్థితి గురించి గల ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హదీసులను ప్రవేశపెట్టి మసీహ్ ఆగమనము గురించి తెలుపబడెను. అహ్మదియ్యత్ అనగా స్వచ్ఛమైన ఇస్లాం అనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పరిచయం చేసిన స్వచ్ఛమైన ఇస్లాం గురించి తెలుపబడెను. నేడు ముస్లిములు దాని చిత్రమును అందవిహీనముగా చేసిరి. అందులో శాంతి, సంధి, ప్రేమానురాగ బోధన గలదు. అందుకు ఆ ఇద్దరు నవయువకులు ఇట్లనిరి. నిస్సందేహముగా మేము విశ్వాస పరంగా ముస్లిములమే. కాని ముస్లిముల ఉగ్రవాదము, కఠినత్వముతో మేము ఎంత విసుగు చెందినామనగా మేము క్రైస్తవులుగా మారబోచుంటిమి. ఈ ముల్లాలు ప్రవేశపెట్టుచున్న విధముగా ఇస్లాం లేదని మాకిప్పుడు తృప్తి కలిగినది. మేము క్రైస్తవులు కాకుండా రక్షించిరని, ఇస్లాంను వీడకుండా

చేసినారని వారు మాకు కృతజ్ఞతలు తెలిపిరి.

స్వచ్ఛమైన ఇస్లాంను చూచి ముస్లిమేతరుల హృదయములలో కూడ ఇస్లాం స్వీకరించాలను ఉత్సాహము కలుగును. వారు కూడ సహకరించడం మొదలు పెట్టెదరు. జాపాన్ ముబల్లిఘ్ ఇట్లనిరి. ఒక బౌద్ధ మతస్తుడు మా శిబిరానికి రాగా వారికి ఇస్లాం పరిచయం చేయించి, ఇతర మతముల గురించి పవిత్ర ఖుర్ఆన్ బోధన గల సూక్తులను తీసి చూపించినాము. తద్వారా వారు కృతజ్ఞతలు తెలుపడమే కాక ఈ అందమైన బోధనను ప్రపంచానికి తెలియజేయాలి, ఇస్లాం గురించి గల అపోహలను తొలగించాలని అనిరి. మరొక్క రోజు వారు మా శిబిరానికి వచ్చి, ఉ॥ 10 గం॥ల నుండి సా॥ 5 గం॥ల వరకు తాను బౌద్ధుడైనను గట్టిగా ఇస్లాం శాంతియుత ధర్మమని నినదించిరి. కరపత్రములు కూడ పంచి పెట్టిరి.

ఇదే విధముగా భారత దేశములో కర్ణాటక రాష్ట్రములో గదగ్ అను ప్రాంతములో పుస్తక శిబిరము ఏర్పాటు చేయనైనది. ఈ పుస్తక శిబిరమునకు ఒక ముస్లిమేతర మిత్రుడు వచ్చెను. తరువాత ఇట్లనిరి. మేము ఇంతకు ముందు కూడ అనేక పుస్తక శిబిరములను చూచితిమి. కాని శాంతియుత సందేశమిచ్చు, ఇస్లాం అందమైన బోధనను ప్రజలకు అందించు వారిని నేనింత వరకు చూడలేదు. వారు ప్రభావితులై, మా పుస్తక శిబిరము నుండి చాలా పుస్తకములు కొనుగోలు చేసుకొని పోయిరి.

లగ్జమ్‌బర్గ్ అను నగరములో ప్రదర్శన సమయమున జమాఅత్ తరపున పుస్తక శిబిరము ఏర్పాటు చేయనైనది. ప్రదర్శన సమయమున నగర మేయర్ కూడ స్టాండ్ వరకు వచ్చి అనేక పుస్తకములను చూచిరి. అనంతరం లగ్జమ్‌బర్గ్ జమాఅత్ అధ్యక్షులు వారికి జమాఅత్ పరిచయం చేయించిరి. వారికి ఒక పుస్తకము కూడ బహుకరించిరి. అప్పుడు మేయర్ ఇట్లనిరి. మీ సంస్థ అద్భుతంగా పని చేయుచున్నది. ఇస్లాం ఈ అందమైన చిత్రమును త్వరతగతిన ప్రపంచములో వ్యాపింపజేయవలెను.

నిరాశకు గురైన ఒక క్రొత్త ముస్లిం వ్యక్తి సంఘటనను తెలిపెదను. హాలేండ్ అమీర్ గారిట్లు వ్రాసిరి. హాలేండ్ ఒక డచ్ ముస్లిం బిలాల్ గారు ముస్లిముల దీన స్థితి చూచి తీవ్ర నిరాశకు గురైరి. వారిట్లనిరి. నేను అహ్మదియ్య జమాఅత్ బోధనల ద్వారా చాలా ప్రభావితమైనాను. అహ్మదియ్య జమాఅత్ సత్యమును అల్లాహ్ తఆలా నాకు స్పష్టముగా తెలిపెను. తద్వారా బైఅత్ చేయు అనుగ్రహము నాకు లభించినది. ఇప్పుడు నేను జమాఅత్ కార్యక్రమములలో పాల్గొంటున్నాను. ఆధ్యాత్మికంగా నేను చాలా ప్రగతి చెందినాను. గతములో యున్న వ్యాకులత ఇప్పుడు అంతమగుచున్నది.

పవిత్ర ఖుర్ఆన్ బోధన ఇతరులను ఎలా ప్రభావితము చేయును. కెనడా నుండి మన ఒక మిత్రులు దాఇ ఇలల్లాహ్ ఇట్లు వ్రాసిరి. మేమొక ప్రచార శిబిరము ఏర్పాటు చేసితిమి. ఒక ఆంగ్ల దంపతులు మా శిబిరానికి వచ్చిరి. భార్య కఠిన క్రైస్తవురాలు. పవిత్ర ఖుర్ఆన్ కొనగోలు చేయకూడదని భర్తను గట్టిగా వారించెను. పవిత్ర ఖుర్ఆన్ తీసుకొనుటకు ఆమె రాజీ అగుటకు పవిత్ర ఖుర్ఆన్‌లోని ఒక విషయము చెప్పగలరని భర్త అనెను. హజ్రత్ ఈసా అలైహిస్సలాం, వారి తల్లి హజ్రత్ మర్యమ్ అలైహస్సలాం ప్రస్తావనపై పవిత్ర ఖుర్ఆన్‌లో ఒక సూర గలదు. వారి గురించి మీకు బైబిల్‌లో లభించని వివరములు ఇందులో గలవు. ఆ పుట తీసి వారికి చూపబడెను. అనువాదమును వారి భార్య చదవడం మొదలు పెట్టిరి. కొంత సమయము చదివిన తరువాత నిజముగనే ఆసక్తికర పుస్తకమని అనిరి. ఖుర్ఆన్ ద్వేషముతో కూడిన మతమని మేము ప్రెస్‌లో చదివినాము, మీడియా మాకు తెలిపినది, పత్రికలు మాకు సూచించినవి. కాని ఇందులో ఈసా అలైహిస్సలాం, వారి తల్లిని ప్రేమతో ప్రస్తావించనైనది. కనుక వారు పవిత్ర ఖుర్ఆన్ కొనుగోలు చేసిరి. కొన్ని వారాల తరువాత రెండవ సారి శిబిరము వద్దకు వచ్చి కృతజ్ఞతలు

తెలుపుచు ఇట్లనిరి. మేము పవిత్ర ఖుర్ఆన్ చదివినాము. పవిత్ర ఖుర్ఆన్‌ను చదవగా లేదా సంక్షిప్తముగా చూచినా మీడియాలో ఇస్లాం, హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గురించి ప్రచారము చేయబడుచున్న ద్వేషము దూరమై, అపోహలు తొలగిపోవును.

బేనిన్‌లో పుస్తక శిబిరములో ప్రభుత్వ ఉపాధ్యాయుడు వచ్చి, జమాఅత్ ప్రేమానురాగ బోధనను చదివి ఇట్లనిరి. నా విద్యార్థుల కొరకు కూడ నాకు లిటరేచర్ ఇవ్వగలరు. వారు కూడ ఈ లిటరేచర్‌ను చదవాలని, శాంతియుత వాతావరణము ఏర్పాటు కావాలని నేను ఆశించుచున్నాను. పూర్తిగా ఇస్లాం వ్యవస్థ అయిన అహ్మదియ్య జమాఅత్ వ్యవస్థను చూచి సత్యస్వభావము గల ముస్లిములు ప్రభావితమగుదురు. ఇదే విషయము వారు మార్గదర్శనము పొందుటకు కారణమగును. బోర్కీనాఫాసు మురబ్బి ఇట్లనిరి. సిలాగోగు అను ఒక ప్రాంతమునకు ప్రచార నిమిత్తం వెళ్లితిమి. మొత్తం స్త్రీ, పురుషులందరు ప్రచారము వినుటకు కూడిరి. ఒక మిత్రులు జకరియ్యా గారొచ్చి ఇట్లనిరి. నేను కొంత కాలము క్రితం ఒక సత్యస్వప్నము చూచితిని. అందులో నేను చందా చెల్లించుచున్నాను. బైతుల్‌మాల్ యున్న ఇస్లాం సంస్థకే చందా ఇవ్వమని నాకు చెప్పబడెను. నేను చాలా కాలము నుండి ఇటువంటి ఇస్లాం సంస్థను అన్వేషించుచున్నాను. కనుక మురబ్బిగారు జమాఅత్ ఆర్థిక విధానము గురించి చెప్పినప్పుడు నాకు నా స్వప్న భావము తెలిసినది. కనుక వారు వెంటనే 10 వేల ఫ్రాంక్ సీసా రూ॥ చెల్లించిరి. ప్రజలు ఈ స్వప్నము విని, అధికారికంగా ఒక రసీదు పుస్తకము యుంటున్నది, రికార్డ్ భద్రముగా యుండునని చూచి చాలా ప్రభావితమైరి. అనంతరం అల్లాహ్ తఆలా కృపానుసారము 282 మంది బైఅత్ చేసిరి. వీరందరు జమాఅత్ చందా వ్యవస్థలో కూడ చేరిరి.

గోయిటె మాలాలో కరపత్రములు పంచుచున్న సమయమున ఒక నవయువకుడు యూసుఫ్ గారు పరిచయమైరి. మిషన్ హౌజ్ వచ్చి అహ్మదియ్యత్‌ను స్వీకరించిరి. వారు కొద్ది కాలము క్రితము ఇస్లాం స్వీకరించిరి. అహ్మదియేతర మస్జిదునకు వెళ్లి సంతృప్తి కలగలేదు. ప్రజలు పరస్పరం కుట్ర, ద్వేషము కలిగియుందురు. ఒక రోజు నేను దుఆ చేసి నిద్రకు ఉపక్రమించగా స్వప్నములో ఎంతో ఆధ్యాత్మికమైన ముఖము గల ఒక మహా వ్యక్తిని చూచితిని. ఒక మార్గములో బూడిదయే, బూడిద యున్నది. ఈ గొప్ప వ్యక్తి నా ముందట నడుచుచున్నారు. నా వెనుక నడవమని నాకు వారు సంజ్ఞ చేసిరి. ఆ గొప్ప వ్యక్తి నడవడంతో మార్గము స్పష్టమగుచుండెను. వారికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చిత్రము చూపగా వీరే నాకు స్వప్నములో దారి చూపించుచుండిరని అనిరి. అల్లాహ్ తఆలా కృపానుసారము ఈ విషయము వారిని విశ్వాసములో మరింత దృఢపరచెను.

ఫ్రాన్స్ అమీర్ గారిట్లు వ్రాసిరి. ఒక క్రొత్త అహ్మదీ మిత్రుడు కమాల్ గారిట్లు తెలిపిరి. నేను చాలా సం॥ల నుండి నామమాత్రపు ముస్లింగా యుంటిని. ఉలమాల తరపున చేయబడుచున్న పవిత్ర ఖుర్ఆన్ విశ్లేషణలతో నాకు సంతృప్తి కలిగేది కాదు. వారి బావగారు వారితో అహ్మదియ్య జమాఅత్ గురించి ప్రస్తావించిరి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహు అన్‌హు విశ్లేషణ చదవమని అనగా చదివి, ఇంత సాధారణ రీతిలో ఇంత గొప్ప విశ్లేషణ 14 వందల సం॥లో మరెవరు ఎందుకు వ్రాయలేదని ఆశ్చర్యపోతిని. అనంతరం ఎమ్.టి.ఏ., ఇంటర్నెట్‌పై కూడ హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చాలా పుస్తకములను చదివితిని, అనేక కార్యక్రమములను చూచితిని. నా చేతికి ఏదో నిధి లభించినట్లు, నా ఆత్మకు స్వేచ్ఛ లభించినట్లు నేను భావింతిచిని. నా సందేహములన్నియు దూరమైనవి, నిజమైన ఇస్లాంను తెలుసుకొన్నాను. కనుక బైఅత్ చేసిరి.

ప్రపంచములోని వివిధ ప్రాంతములో జమాఅత్ ద్వారా శాంతి, సంధి, ఆప్యాయతతో కూడిన ఇస్లాం సందేశము అందును. తద్వారా పుణ్యస్వభావము గల వారు దానిని స్వీకరింతురు. ముబల్లిఘ్ ఇంచార్జి గోయిటెమాలా

ఇట్లు వ్రాసిరి. లీఫ్‌లెట్స్ పంచినందున 91 మంది ఇస్లాం స్వీకరించిరి. అహ్మదియ్యత్‌ను స్వీకరించువారిలో ఒక పాద్రి కూడ యున్నారు. వీరు 33 సం॥లు కేథలిక్ చర్చి పాద్రి, 5 సం॥ల వరకు ప్రొటెస్టెంట్ వర్గములో యుండిరి. ఇదే విధముగా డోమంగూ అని మరొకరు మున్సిపల్‌లో న్యాయమూర్తిగా విధులు నిర్వహించు వ్యక్తి కూడ వీరిలో యున్నారు. అహ్మదియ్యత్‌ను స్వీకరించిన తరువాత వీరు తమ ప్రాంతములో ఒక ప్రచార సమావేశము ఏర్పాటు చేసిరి. ఇందులో చాలా వివరముగా ఇస్లాం బోధన తెలుపబడెను, ప్రశ్నోత్తరాలు జరిగినవి. వారి నివేదిక ప్రకారము 7 గం॥లు ఈ సమావేశము కొనసాగినది. సమావేశము ముగియక ముందే ఈ సమావేశములో పాల్గొన్న సభ్యులందరు ఇస్లాంను స్వీకరింతుమని ప్రకటించిరి. వీరి సంఖ్య 89 యుండెను. వీరిలో స్త్రీ, పురుషులందరు యుండిరి.

ఇది ఇస్లాం మొక్క, ఇది అల్లాహ్ తఆలా నాటిన మొక్క. ఈ కాలములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి మేరకు దీనిని పోషించుటకు అల్లాహ్ తఆలా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను పంపెను. ప్రళయ దినము వరకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నుండి లబ్ధి పొందుచు వారు తమ కర్తవ్యమును నిర్వర్తింతురు. అల్లాహ్ తఆలా దీనికి నీరందించును. ఇన్షాఅల్లాహ్. ఈ మొక్క సదా సశ్యశ్యామలముగా యుండును. ఇన్షాఅల్లాహ్.

ప్రపంచమును అల్లాహ్ తఆలా ఇష్టము మేరకు నడుపుటకు, శాంతి, ప్రేమను పంచుటకు ఈ పలు సంఘటనలను నేను ప్రస్తావించితిని. మన విశ్వాసమును బలపరచు వేలాది సంఘటనలు మనకు తెలియుచుండును. ఏ విధముగా అల్లాహ్ తఆలా ప్రజల హృదయములను తెరుచును, ఎలా ఇతరుల నోటి ద్వారా మన పక్షమున అంగీకారములను వెలువడించును. ఒకరు ఆఫ్రికా నివాసులు, మరొకరు అరబ్, ఐరోపా, సౌత్ ఆఫ్రికా నివాసులైనను అందరిపై ఒకేలా ప్రభావము పడుచున్నది. ఎందుకనగా అంతర్జాతీయ బోధన ఒక్కటే. అదే ఇస్లాం బోధన. ప్రతి న్యాయ ప్రియుడు తక్షణమే ఇస్లాంను స్వీకరించినా స్వీకరించకపోయినా ప్రపంచ శాంతికి మూలము ఇస్లామే అనడంలో వెనుకంజ వేయలేడు. స్వార్థ ముస్లిం నాయకుల, స్వార్థ వర్గముల చర్యను ఇస్లాం బోధనగా ఏ న్యాయ ప్రియుడు నమ్మడు. న్యాయము లేనివారే అటుల అందురు. ఇస్లాం వ్యతిరేక శక్తులు ఇస్లాం గురించి ఎంత వ్యతిరేక ప్రచారము చేసినను ప్రపంచానికి దైవ సామీప్య మార్గములు చూపించవలసినది, శాంతి, సంధిని అందించునది ఇస్లామే. ప్రపంచ శాంతి, సంధికి ఇస్లామే మూలమని నేడు కాక రేపైనా ప్రపంచము అంగీకరించును.

ఈ విసయములో భాగస్వాములగు అనుగ్రహము అల్లాహ్ తఆలా మనకు కలిగించుగాక! అల్లాహ్ తఆలా అనుగ్రహములను అనేక రెట్లు అధికంగా చూచువారమగుగాక! తమ ఆచరణలను ఇస్లాం బోధన ప్రకారము చేయువారమగుగాక! (ఆమీన్)

✡ ✡ ✡

BOOK POST (PRINTED MATTER)

To,
................................................................................
................................................................................
................................................................................